క్లుప్తంగా

'ఆడుదాం ఆంధ్రా'కు ఏర్పాట్లు



సారికలో క్రీడా పోటీల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లు

విజయనగరం రూరల్: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి నిర్వహించనున్న ఆడుదాం... ఆంధ్రా క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీఓ గంటా వెంకటరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, సారిక గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల వద్ద డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేతులమీదుగా పోటీలు ప్రారంభిస్తామన్నారు. ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పర్యవేక్షణలో క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఈ నెల 31 వరకు 13 వేదికల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండల శాఖ అధికారులు హాజరు కావాలని కోరారు.

చిల్లపేట రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు



అభివృద్ధి చెందనున్న చిల్లపేట - దుప్పాడ రోడ్డు

విజయనగరం రూరల్: దుప్పాడ సచివాలయం పరిధిలోని చిల్లపేట రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రోడ్డు పాడవ్వడంతో కొన్నేళ్లుగా వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రజలు నరకయాతన పడ్డారు. ఎట్టకేలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషితో ప్రభుత్వం రూ. 49 లక్షలు మంజూరు చేసింది. దీంతో చిల్లపేట, దుప్పాడ గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాజ్యాధికారమే లక్ష్యం



మార్క్స్ నగర్‌లో జెండాను ఎగురవేస్తున్న అశోక్

విజయనగరం ఫూల్‌బాగ్: పేద, బడుగు, బలహీన, శ్రామికవర్గాలకు రాజ్యాధికారం అందించాలనే లక్ష్యంతో పోరాటం చేస్తున్నామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. సీపీఐ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో పీడబ్ల్యూ మార్కెట్ శాఖ, మార్క్స్‌నగర్ శాఖ, పడమర బల్లివీధి, మసీదు రిక్షాస్టాండ్ శాఖ, శాంతినగర్ శాఖలలో సీపీఐ జెండాలు ఎగురవేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు ఎస్. రంగరాజు, బి. రమణమ్మ, బి. పావని, బి. గౌరినాయుడు, పి. రాంబాబు, పి. అప్పలరాజు, ఎ. రాములు, కె. సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



రిక్షాలో నిద్రిస్తున్న వృద్ధుడికి దుప్పటి కప్పుతున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: చలికాలంలో వృద్ధులను సంరక్షించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ధర్మపురి యువ సోషల్ సర్వీస్ ప్రతినిధులు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి పట్టణంలోని పలువురు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరాక్ట్ క్లబ్ ధర్మపురి సంస్థ ప్రతినిధులు సాయి, శంకర్, అశోక్, నారాయణమూర్తి, పవన్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

కొత్తవలస: మండల కేంద్రానికి చెందిన ఓ.మురళీకృష్ణ భార్య అనారోగ్యంతో మూడు నెలల క్రితం మృతి చెందారు. ఆమె వైద్యఖర్చుల నిమిత్తం అప్పటిలో ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.3 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మండలంలోని అర్ధన్నపా లెం గ్రామం సమీపంలోని తన క్యాంప్ ఆఫీస్‌లో మృతురాలి భర్త మురళీకృష్ణకు సోమవారం అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, సీఎం సహాయ నిధికి సిఫా ర్సు చేసిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబుకు మృతురాలి భర్త కృతజ్ఞతలు తలిపారు. జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పరిశుద్ధ పరమాత్ముడా...



క్రిస్మస్ తాతలుగా చిన్నారులు



విజయనగరం టౌన్: అంబటిసత్రం వద్దనున్న ఏసు ప్రేమాలయంలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ అలజంగి రవికుమార్



విజయనగరం టౌన్: కణపాక యూత్ హాస్టల్‌లో చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



విజయనగరం: క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

పరిశుద్ధ పరమాత్ముడైన ఏసు ప్రభువు జన్మదినాన్ని పురస్కరించుకుని వాడవాడలా క్రిస్మస్ పండగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిలను విద్యుత్ కాంతులతో అందంగా ముస్తాబు చేశారు. అలాగే క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజాలతో చర్చిలు, ఇళ్ల పరిసర ప్రాంతాలు ఆహ్లాదకరంగా మారాయి. ఉదయం నుంచే ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఏసు రాకను స్వాగతిస్తూ గీతాలు ఆలపించగా..చిన్నారులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. విశ్వాసకులు ఏసు గొప్పతనాన్ని, జీవన సత్యాలను తెలియజేశారు. నగరంలోని సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో జరిగిన వేడుకల్లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీస్తుమార్గం అనుసరణీయమన్నారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



జిల్లా కేంద్రంలోని కంటోన్మెంట్ బాప్టిస్టు చర్చిలో ప్రార్థన



జిల్లా కేంద్రంలోని ఆర్‌సీఎం చర్చిలో క్రైస్తవ గేయాలను ఆలపిస్తున్న చిన్నారులు



ఆర్‌సీఎం చర్చిలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పూసపాటిరేగ: యూఆర్‌పీఎఫ్ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ జీవన్‌కుమార్



డెంకాడ: చింతలవలస బెటాలియన్ సమీపంలో ఉన్న చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు

నగర అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం



క్లాక్ టవర్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, క్లబ్ ప్రతినిధులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగర అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కంటోన్మెంట్ ఎస్‌బీటీ మార్కెట్ జంక్షన్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన క్లాక్ టవర్‌ను సోమవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, కార్పొరేషన్ స్థాయికి అవతరించిన తర్వాత నగరానికి అదే స్థాయి హంగులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. ఈ విషయంలో రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు మరువరానివన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గతంలో స్వర్గధామం, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటయ్యాయని చెప్పారు. ఆ సమయంలో తాను శాసనసభ్యుడిగా ఉన్నానని తెలిపారు. క్లాక్ టవర్ కూడా తన హయాంలోనే ఏర్పాటు కావడం ఆనందంగా ఉందని చెప్పారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు కోరిన వెంటనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు 430 గజాల స్థలాన్ని సమీకరించి అందజేశామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గవర్నర్ రావూరి దత్త సుబ్బారావు, అధ్యక్షులు డాక్టర్ కృష్ణశాంతి, కమ్యూనిటీ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ తిరుమల ప్రసాద్, కార్యదర్శి నీతా విజ్వాణి, ప్రాజెక్ట్ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

28న చలో కలెక్టరేట్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 28న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి బి. రమణ తెలిపారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ప్రమాదంలో వికలాంగులుగా మారితే రూ. 2 లక్షలు, మరణిస్తే 5 లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అలాగే భవన నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద చేపట్టనున్న కార్యక్రమాల్లో కార్మికులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి కంది త్రినాథ్, కమిటీ నాయకులు రమేష్, సతీష్, పైడినాయుడు, చినబాబు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బడ్డుకొండకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే బడ్డుకొండను సత్కరిస్తున్న సుందర హరీష్, తదితరులు

డెంకాడ: ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు భోగాపురం మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన సుందర హరీష్ కృతజ్ఞతలు తెలిపారు. మోపాడలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యేను సోమవారం కలిసి ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

జామి: ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే పుష్పగిరి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారికి క్షీరాభిషేకం, కుమరాం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సమ్మెను విజయవంతం చేయండి

విజయనగరం ఫూల్‌బాగ్: రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి భాస్కరరావు, జిల్లా బాధ్యుడు జగన్ మోహనరావు పిలుపునిచ్చారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికుల సమస్యలను అధికారులు పరిష్కరించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామారావు, అశోక్, రామచంద్రరావు, రాజు, రమా, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: మండలంలోని అక్కివరం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా పలు గ్రామాలకు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పి.అప్పలస్వామినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కివరం, బంటుపల్లి, పేడాడ, రాజులతమ్మాపురం, గొలగాం, గంట్లాం, బెల్లాం, చినఅమకాం, అమకాం, డి.కొల్లాంలోని కొంతభాగం, టి.కల్లాలు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు క్రీడాపోటీలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థంలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిడుతూరి రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వివిధ క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు. షెడ్యూల్ ప్రకారం అన్ని సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని క్రీడాకారులు సిద్ధం కావాలన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



వినియోగానికి దూరంగా ఉన్న మరుగుదొడ్లు

నెల్లిమర్ల: పట్టణంలోని మహాత్మా జ్యోతిరావుపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల (మత్స్యకారులు)లో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఈ పాఠశాలలో 267 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరికీ సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్న వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడం వల్ల సమస్య ఎక్కువగా ఉందని విద్యార్థులు, సిబ్బంది చెబుతున్నారు. ఇదే విషయమైన పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. త్వరలో మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

సేవా కార్యక్రమాలతో గుర్తింపు



బీపీఎం పాఠశాలలో ప్రారంభించిన సైన్స్ ల్యాబ్

- రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు

విజయనగరం: విస్తృత సేవా కార్యక్రమాలతోనే స్వచ్ఛంద సంస్థలకు సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త) అన్నారు. సోమవారం ఆయన నగరంలో పర్యటించి పలు సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. పట్టణంలోని కంటోన్మెంట్ బాలాజీ మార్కెట్‌లో రోటరీ క్లబ్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కోట జంక్షన్ వద్ద కూరగాయలు విక్రయించే ఆరుగురు వర్తకులకు గొడుగులు పంపిణీ చేశారు. అనంతరం రోటరీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, క్లబ్ ద్వారా ఈ ఏడాది విజయనగరంలో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు , 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ, ప్రభుత్వ పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు, గ్రామాలలో రక్షిత నీటి పథకాల నిర్మాణం వంటి వివిధ కార్యక్రమాలను లక్షలాది రూపాయలు వెచ్చించి చేపట్టామని చెప్పారు. సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామన్నారు. సమావేశంలో క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణశాంతి, కమ్యూనిటీ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ తిరుమల ప్రసాద్, కార్యదర్శి నీతూ విజ్వాని, బి. సూర్యలక్ష్మి, గవర్నర్ (ఎలెక్ట్) డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్ అంచాలయ, వినోద్, రాధికారాణి, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాతగా నిలుద్దాం..

విజయనగరం: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు ఇన్నర్ వీల్ క్లబ్ స్ఫూర్తి ప్రదాత అని క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ జి.శ్రీదేవి అన్నారు. సోమవారం ఆమె నగరంలో పర్యటించి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొత్త అగ్రహారంలోని పురాతన బీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సుమారు 80 వేల రూపాయల విలువచేసే పరికరాలు అందజేసి, ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం తోటపాలెంలోని కైలాస భూమిలో 90 వేల రూపాయలతో వసతులు కల్పించారు. గంటస్తంభం వద్ద గల మహిళా పార్కును పరిశీలించి 14 వేల రూపాయలతో బెంచీలు ఏర్పాటు చేశారు. విజయనగర ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు కాపుగంటి సుధ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి సంధ్యారమతో పాటు ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాగవంశీకుల సంక్షేమానికి ప్రాధాన్యం



వృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న అవనాపు విక్రమ్, విజయ్

- అవనాపు విక్రమ్, విజయ్

విజయనగరం: నాగవంశ సామాజికవర్గ సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని నాగవంశ సంక్షేమ సంఘ అధ్యక్షుడు అవనాపు విక్రమ్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి అవనాపు విజయ్ అన్నారు. సోమవారం స్థానిక సంఘ భవనంలో సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి నెలా వృద్ధుల కోసం మెడికల్ క్యాంప్ కూడా నిర్వహిస్తామన్నారు. సంక్రాంతి పండుగ తర్వాత ఐ క్యాంప్ నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు. త్వరలో నాగవంశీయుల వివాహ పరిచయ వేదిక నిర్వహించే ఆలోచనలో ఉన్నామని, సభ్యులంతా చర్చించుకుని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. తమ తండ్రి స్వర్గీయ అవనాపు సూరిబాబు, పెదనాన్న అప్పలనాయుడు జ్ఞాపకార్థం అంతిమయాత్ర వాహనాన్ని సమకూరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాగవంశం సంక్షేమ సంఘ ప్రతినిధులు కాళ్ల గౌరీశంకర్, గాడు అప్పారావు, రామసింగు సత్య ప్రసాదరావు, గాడు భానోజీరావు, కనకల కృష్ణ, పోలుబోతు మోహనరావు, రాయన నారాయణరావు, తలడా సత్యారావు, బుగత రోజాకుమార్, నామాల సర్వేశ్వరరావు, అవనాపు శ్రీను, బొడ్డు రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.